క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు



ఇబ్రహీంపట్నం: ప్రయాణికుల భద్రత నేపథ్యంలో ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలో ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ ఆటోకు సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. యూనిఫామ్ తప్పనిసరిగా ధరించాలని చెప్పారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని హెచ్చరించారు. ఎక్కడబడితే అక్కడ ఆటోలు నిలిపివేయడం వలన ట్రాఫిక్ సమస్య తలెత్త డానికి కారణం కాకూడదన్నారు. ఆటోల్లో వదిలిన వస్తువులు స్థానిక పోలీస్ స్టేషన్‌లలో అప్పగించాలని సూచించారు. మైనర్‌లకు ఆటోలు అద్దెకు ఇస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రేపు నూతన ధ్వజ స్తంభ పునః ప్రతిష్ఠ

నూజివీడు: పెద్ద గాంధీ బొమ్మ సెంటర్‌లోని శ్రీ సత్యసాయి సీతారామ మందిరంలో ఆదివారం ధ్వజ స్తంభ పునః ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్తలు పేర్ల ప్రశాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:24 గంటలకు ధ్వజ స్తంభ పునః ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుందని, దీనిలో భాగంగా ఆ రోజు ఉదయం ఐదు గంటల నుంచి పలు వైదిక కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం అన్నదానం చేస్తామని చెప్పారు.

మహా కుంభమేళాలో మైలవరం భక్తులు



మైలవరం: ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళా కార్యక్రమంలో మైలవరానికి చెందిన 50 మంది భక్తులు పాల్గొని పూజాదికాలు పూర్తి చేసుకుని శుక్రవారం తిరిగి వచ్చారని ఉభయ కృష్ణా జిల్లా ధార్మిక మండల సభ్యులు వి. బాలాజీ ప్రసాద్ తెలిపారు. ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా స్నానానంతరం కాశీ, అయోధ్య, నైమిశారణ్యం, గయ తదితర పుణ్యక్షేత్రాలను దర్శించి వచ్చారని చెప్పారు. ఇటువంటి కార్యక్రమాలు హిందూ సమాజాన్ని ఏకం చేసేందుకు, హిందూ మత విశ్వాసాలను పెంపొందించేందుకు దోహదపడతాయన్నారు.

ఆర్డీఓ రక్తదానం



తిరువూరు: తిరువూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక శ్రీ వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. తిరువూరు ఆర్డీఓ కె. మాధురి శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేశారు. ఆర్డీఓ సేవా దృక్పథాన్ని అభినందిస్తూ లయన్స్ క్లబ్ సభ్యులు ఆమెను సత్కరించారు. డిస్ట్రిక్ట్ బ్లడ్ సెంటర్ లయన్ చిగురుపాటి మంజువాణీ వరప్రసాద్, మక్కిన వినోద్‌ల పర్యవేక్షణలో జరిగిన శిబిరంలో విద్యార్థులు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు రక్తదానం చేశారు. తిరువూరు క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వరరావు, మండల ఆర్య వైశ్య సంఘాధ్యక్షుడు జంగాల మురళీకృష్ణ, వాహినీ కళాశాల కమిటీ చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రంగా నాగేంద్ర బాబు, లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

కంచికచర్ల: స్థానిక ఎరువులు దుకాణాలలో వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కంచికచర్ల జుజ్జూరు రోడ్డులోని విజయ దుర్గ ఫెస్టిసైడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్ దుకాణంలో తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించగా సరైన అనుమతిపత్రాలులేని కారణంగా అమ్మకాలను నిలిపివేసినట్లు నందిగామ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు, ప్రత్యేక అధికారిణి శశికళ తెలిపారు. కొత్త రకం ఎరువులు, పురుగుమందులు వచ్చిన సమయంలో వాటికి సంబందించిన ఓ ఫారంలను లైసెన్స్‌లో పొందుపర్చాలని లేనిపక్షంలో అమ్మకాలను నిలిపి వేస్తామని ఆమె వివరించారు. తనిఖీల్లో మండల వ్యవసాయయ అధికారి కే విజయకుమార్ పాల్గొన్నారు.

అందుబాటులో మందులు

పెనుగంచిప్రోలు: చర్మ వ్యాధులతో బాధపడుతున్న కుక్కలకు అవసరమైన మందులు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పశు వైద్యాధికారి పి.అనిల్ తెలిపారు.₹కుక్కలకు..చర్మ వ్యాధులు..భయపడుతున్న ప్రజలు₹ శీర్షికన ×సాక్షి₹ దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. చర్మ వ్యాధులతో బాధపడుతున్న కుక్కలను గ్రామ పంచాయతీ వారి సహకారంతో పట్టుకుని తీసుకువస్తే వైద్యసేవలు అందిస్తామని వివరించారు.

గోకులాల్లోనూ పచ్చపాతం

- కేటాయింపులు కూటమి సానుభూతిపరులకే
- గోకులాలను దక్కించుకునేందుకు పోటీ పడుతున్న కూటమి నాయకులు
- నియోజకవర్గానికి 168 గోకులాలు మంజూరు
- ఎమ్మెల్యే కార్యాలయం నుంచే అర్హుల జాబితా ఎంపిక
- దరఖాస్తు చేసేందుకు కూడా వెనుకాడుతున్న పాడి రైతులు



దుగ్గిరాలపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్డు

జి.కొండూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజకీయ వివక్ష తారస్థాయికి చేరింది. గతంలో జన్మభూమి కమిటీలతో రాష్ట్ర ప్రజలను వివక్షకు గురిచేసి తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్న కూటమి ప్రభుత్వం, మరోసారి అదే తీరును కొనసాగిస్తోంది. ఇప్పటికే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి మధ్యాహ్న భోజనంలో వంట ఏజెన్సీలు, ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌లు, వీఓఏల వరకు అందరినీ తొలగించి తమ పార్టీకి చెందిన వ్యక్తులనే నియమించుకున్న విషయం తెలిసిందే. ఇక ఇప్పుడు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పాడి పరిశ్రమను వృద్ధి చేసేందుకు మంజూరు చేసిన గోకులం షెడ్ల నిర్మాణంలో వివక్ష ప్రారంభమైంది. దరఖాస్తులు ఎవరైనా చేయవచ్చు కానీ కేటాయింపులు మాత్రం కూటమి పార్టీల సానుభూతి పరులకే జరుగుతోంది. ఈ కేటాయింపులు కూడా ఎమ్మెల్యే కార్యాలయం నుంచే జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గత ప్రభుత్వం గ్రామ వలంటీరు, సచివాలయ వ్యవస్థతో ప్రతి పథకం వివక్షతకు తావులేకుండా మంజూరు చేసింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పథకాలను సైతం కూటమి ప్రభుత్వం తమ పార్టీ వారికే కేటాయించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పోటీ పడుతున్న కూటమి నాయకులు

ఉపాధి హామీ పథకం నుంచి 90 శాతం నిధులు, రైతు వాటా 10 శాతం నిధులతో ఈ షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 90 శాతం నిధులు ప్రభుత్వమే ఇస్తున్న నేపథ్యంలో గోకులం షెడ్లను దక్కించుకునేందుకు కూటమిలోని అన్ని పార్టీల నాయకులు పోటీ పడుతున్నారు. ప్రతి గ్రామం నుంచి పదుల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ఈ క్రమంలో గోకులాల మంజూరు దరఖాస్తుల సంఖ్యలో సగ భాగం కూడా లేకపోవడంతో తమ పార్టీ సానుభూతిపరులకే కేటాయించాలంటూ టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. ఈ పంచాయతీ ఎమ్మెల్యే వద్దకు చేరినట్లు సమాచారం. ఈ క్రమంలో అర్హతను బట్టి అధికారులు ఎంపిక చేసిన జాబితాను ఎమ్మెల్యే కార్యాలయానికి పంపి అక్కడ టిక్కులు పెట్టిన వ్యక్తులకే గోకులాల కేటాయింపు జరుగుతున్నట్లు తెలుస్తోంది. కొందరు అధికార పార్టీ నాయకులైతే ఏకంగా పాత షెడ్లకే బిల్లులు చేయాలని పట్టుబట్టినప్పటికీ అధికారులు తిరస్కరించినట్లు తెలుస్తోంది. గోకులాలను దక్కించుకునేందుకు కూటమి నేతలు పడుతున్న పాట్లు చూసి నిజమైన పాడి రైతులు దరఖాస్తు చేసేందుకు కూడా వెనుకాడుతున్నారు.

గోకులాల నిర్మాణం పథకం వివరాలు

షెడ్డు	నిర్మాణానికి అయ్యే ఖర్చు రూ.	ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు 90 శాతం రూ.	రైతు వాటా 10 శాతం రూ.
రెండు గేదెలకు	1,15,000	1,03,500	11,500
నాలుగు గేదెలకు	1,85,000	1,66,500	18,500
ఆరు గేదెలకు	2,30,000	2,07,000	23,000

మైలవరం నియోజకవర్గంలో ఇప్పటి వరకు మంజూరైన గోకులాలు, నిర్మాణాల వివరాలు

మండలం	గ్రామ పంచాయతీలు	రెండు దశలలో మంజూరైన గోకులాలు	నిర్మాణం పూర్తయినవి
జి.కొండూరు	22	41	20
మైలవరం	13	40	22
ఇబ్రహీంపట్నం	10	30	14
రెడ్డిగూడెం	12	41	24
విజయవాడ రూరల్	5	16	11

ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నాం



గోకులం షెడ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరిని పశు వైద్యాధికారులు పరిశీలించిన అనంతరం అర్హుల జాబితాలో చేర్చుతున్నాం. దశల వారీగా మంజూరైన గోకులం షెడ్డులను అర్హుల జాబితాలో ఉన్న పాడి రైతులకు కేటాయిస్తున్నాం. షెడ్ నిర్మాణంతో పాటు ఐదు ఎకరాలలోపు రైతులకు అర ఎకరంలో పశు గ్రాసం పెంచుకునేందుకు రూ.32,992ను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి చెల్లిస్తున్నాం.

– ఎస్ మాధవరెడ్డి, ఏపీఓ, జి.కొండూరు

● వైఎస్ జగన్‌ను కలిసిన తలశిల



లండన్ పర్యటన ముగించుకుని బెంగళూరు చేరుకున్న మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్సీ తలశిల రఘురాంతోపాటు పలువురు నేతలు స్వాగతం పలికారు.

–గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్)

భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



తిరువూరులో వాసవీ మాతకు పూజలు నిర్వహిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

మైలవరం: మైలవరం కోదండ రామాలయంలో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాసవీ మాతకు అభిషేకాలు, కుంకుమ పూజలు జరిగాయి. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

● **తిరువూరు:** స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శుక్రవారం వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వాసవీ మాతకు విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆర్య వైశ్య సంఘం మండల అధ్యక్షుడు జంగాల మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి నాళ్ళా సురేంద్ర, సభ్యులు పీవీ రావు, అర్పిత, దారా మంజుల, జంగాల సునీత, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

● **చాట్రాయి:** ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మ వారి ఆత్మార్పణ దినోత్సవం చనుబండ గ్రామంలో నిర్వహించారు. కోదండ రామాలయంలో పూజలు నిర్వహించి గ్రామంలో ఊరేగించారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నడిపల్లి కిశోర్, జల్లేపల్లి పరమేశ్వరావు, కొత్తా రామలింగేశ్వరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

● **ఆగిరిపల్లి:** స్థానిక కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన 40 కిలోల అమ్మవారి పంచలోహ విగ్రహానికి అభిషేకాలు, కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు మడుపల్లి గోపాల్, మడుపల్లి శివరామమూర్తి, యండూరి చంద్రశేఖర్, జూలూరు చంద్రమౌళీశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



చనుబండలో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు



ఆగిరిపల్లిలో వాసవీమాత గ్రామోత్సవంలో పాల్గొన్న మహిళలు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

కేఎస్ లక్ష్మణరావు



లక్ష్మణరావుకు సంఘీభావం తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

మైలవరం: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కృష్ణా గుంటూరు గ్రాడ్యుయేట్స్(పీడీఎఫ్) ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు అన్నారు. మైలవరం విశ్రాంత ఉద్యోగుల సమావేశ మందిరంలో లక్ష్మణరావు ఆత్మీయ సమావేశం శుక్రవారం జరిగింది. ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించుకునేందుకు లక్ష్మణరావును గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తి, సౌమ్యుడు అని వక్తలు పేర్కొన్నారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘాలు, అంగన్‌వాడీ సంఘాలు, ఆశా వర్కర్స్ సంఘాలు, పెన్షనర్స్ సంఘాలు, ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ సంఘాలు, కార్మిక సంఘాలు పాల్గొన్నాయి.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ బూత్‌ల పరిశీలన



ఎమ్మెల్సీ పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజ్‌కుమార్

ముసునూరు: గ్రాడ్యుయేట్ ఓటర్లు తమ ఓటు హక్కు సక్రమంగా వినియోగించుకునేలా పోలింగ్ బూత్‌లను సిద్ధం చేయించాలని తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ముసునూరులోని 80, 80ఏ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఓటర్లకు అసౌకర్యం కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ర్యాంపు, విద్యుత్, మంచినీరు, ఫర్నిచర్, టాయిలెట్ సౌకర్యాలను పరిశీలించారు. వీఆర్వో మస్తాన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైలవరం: మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం మైలవరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ జి.రమేష్‌బాబు తెలిపారు. సూరిబాబుపేట, సిద్దిపేట, బస్టాండ్ ఏరియా, రాజాపేట, నారాయణ నగర్, బైపాస్ రోడ్డు, చంద్రబాబు నగర్, కాజీపేట, ఆల్ఫా సెంటర్, నూజివీడు రోడ్డు, విజయవాడ రోడ్డులలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

● **భవానీపురం(విజయవాడపశ్చిమ):** గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ పుష్కరఘాట్ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ పి. రవీంద్ర బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూజివీడు పంపింగ్ స్కీం, పంచాయతీ వాటర్ వర్క్స్, పెయింట్ కంపెనీ, వన్ సెంటర్, మసీద్ స్ట్రీట్, రజక స్ట్రీట్, లైబ్రరీ వీధి, ఐసీఐసీఐ బ్యాంక్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

నేరాల నియంత్రణకు సహకరించాలి



కోకిలంపాడులో మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ

కోకిలంపాడు(తిరువూరురూరల్): నేరాల నియంత్రణకు గ్రామస్తులు సహకరించాలని తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ కోరారు. మండలంలోని కోకిలంపాడులో శుక్రవారం నేరాల నియంత్రణ, సైబర్ నేరాలపై పోలీసులు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న కోకిలంపాడులో రానున్న వేసవిలో నేర నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. దుకాణదారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే నేరాలు జరిగినప్పుడు త్వరితగతిన సొత్తు రికవరీ చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. గ్రామంలోని ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతే సురక్ష లక్ష్యం

ఏసీపీ ప్రసాద్



మాట్లాడుతున్న ఎస్ఐ మోహనరావు, చిత్రంలో ఏసీపీ ప్రసాద్, సీఐ చంద్రశేఖర్

మైలవరం: ప్రజల భద్రతే లక్ష్యంగా సురక్ష కార్యక్రమం ప్రారంభించామని మైలవరం డివిజన్ ఏసీపీ ప్రసాద్ అన్నారు. రెడ్డిగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని కల్యాణ మండపంలో శుక్రవారం సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల రక్షణే లక్ష్యంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. పోలీస్ వ్యవస్థ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్, ఎస్ఐ మోహనరావు, పోలీస్ సిబ్బంది, కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

10 లీటర్ల సారా స్వాధీనం

చాట్రాయి: పోతనపల్లి గ్రామంలో సారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి, తయారీదారుడు బాణావతు బాలుని అదుపులోకి తీసుకున్నామని నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐ మస్తానరావు తెలిపారు. 50 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని, 10 లీటర్ల సారా, సారా రవాణా చేస్తున్న బైక్‌ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

మైలవరం: విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని మైలవరం ఎంఈఓ ఎల్. బాలు అన్నారు. చిలుకూరివారిగూడెం, చంద్రగూడెం, మైలవరం జెడ్పీ బాలుర హైస్కూల్‌లో డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర శాఖ తయారు చేసిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి. శ్రీను, యూనియన్ నాయకులు పి.నాగరాజు, జడ్ శ్రీనివాసరెడ్డి, కె.కోటేశ్వరరావు, ఆర్‌వీఎస్ రామకృష్ణారావు దితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందాలి

తిరువూరురూరల్: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంచుకుంటే భవిష్యత్‌లో మంచి పౌరులుగా ఎదుగుతారని వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమ రాష్ట్ర రిసోర్స్ పర్సన్ ఎం. రాంప్రదీప్ అన్నారు. తిరువూరు మండలం గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమంపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఇంటికొక పారిశ్రామికవేత్త తయారు కావాలనే లక్ష్యంతో ప్రభుత్వం తొమ్మిదో తరగతిలో వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధిని పాఠ్యాంశంగా ప్రవేశపెట్టిందని చెప్పారు.

10 నుంచి కల్యాణోత్సవాలు

తిరువూరు: స్థానిక పాత తిరువూరులోని వేంకటాచలస్వామి తిరు కల్యాణోత్సవాలు ఫిబ్రవరి 10 నుంచి ప్రారంభమవుతాయని ఆలయ అర్చకుడు దేవయాజనం వేణుగోపాలాచార్యులు తెలిపారు. 12న రాత్రి 10 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం, 14న రథోత్సవం, 15న పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

అమలులోకి ఎన్నికల నియమావళి

పెనుగంచిప్రోలు: కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎలక్షన్ కోడ్ నిబంధనలు అమల్లోకి వచ్చాయని ఎంపీడీఓ జి.శ్రీను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 8వ తేదీ వరకు ఎన్నికల నియమావళి అమల్లో ఉంటుందన్నారు. కోడ్ అమల్లో ఉన్నందున గ్రామాల్లో ఎటువంటి రాజకీయ పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు ఉండకూడదన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో రాజకీయ నాయకులు ఫొటోలు ఉండకూడదని చెప్పారు.

కానరాని మామిడి పూత

ఆందోళనలో రైతులు




ఆగిరిపల్లిలో ఇప్పుడిప్పుడే వస్తున్న మామిడి పూత

ఆగిరిపల్లి: కరోనా సమయం నుంచి మామిడి రైతులకు నష్టాలు తప్పడం లేదు. గత ఏడాది పూత బాగానే ఉన్నా ముంచు కారణంగా దిగుబడి పడిపోయింది. సాధారణంగా ఇక్కడ ప్రాంతాల్లో డిసెంబర్ మాసానికి పూత ప్రారంభమై ఫిబ్రవరి నాటికి పిందెలు వస్తాయి. కానీ ఈ ఏడాది జనవరి ముగిసి ఫిబ్రవరి నెల వస్తున్నా ఇప్పటివరకు పూత సరిగా రాకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ఆగిరిపల్లి మండలంలో 20 వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. వీటి నుంచి వచ్చిన అధిక భాగం మామిడిని మార్కెట్‌కు తరలిస్తుండగా, పలువురు పల్ప్ ఫ్యాక్టరీలకు విక్రయిస్తున్నారు.

వేలాది రూపాయలతో మందుల పిచికారీ..

వర్షాకాలం ముగిసిన అనంతరం పూతతో కళకళలాడాల్సిన తోటల్లో ఇంకా మొగ్గ వస్తున్న లక్షణాలు సైతం కనిపించడం లేదు. పూత కోసం వేల రూపాయలు వ్యయం చేసి మరీ రైతులు మందులు పిచికారీ చేస్తున్నారు. కానీ దట్టమైన పొగ మంచు వారి ఆశలపై నీళ్లు చల్లుతోంది. ఈ ఏడాది వర్షాలు బాగా పడటంతో మామిడి పంట ఆశాజనకంగా ఉంటుందని రైతులు తొలుత భావించారు. అయితే ప్రతి ఏడాది వడ్లమాను, కొత్త ఈదర తదితర గ్రామాల్లో మామిడి తోటలో పూతవచ్చేది. ఈ ఏడాది భిన్నంగా ఆయా గ్రామాల్లో కూడా మామిడి తోటలో ఆశాజనకంగా పూత రాలేదు. ఫిబ్రవరి నెలలోనైనా పూత వచ్చే అవకాశం ఉందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.


దిగుబడిపై ప్రభావం..



మామిడి తోటలో పూత ఆలస్యమైతే దిగుబడిపై ప్రభావం చూపుతుంది. పూత ఆలస్యమైతే కాయలు అదునులో వచ్చే పరిస్థితి ఉండదు. ఫిబ్రవరి నెలలో మామిడి తోటలో పూతపై ఆశలు సజీవంగా ఉన్నాయి.

– నక్కనబోయిన శ్రీమన్నారాయణ, మామిడి రైతు, ఆగిరిపల్లి

మందులు పిచికారీ చేయాలి



వాతావరణం అనుకూలించకపోవడంతోనే పూత ఆలస్యం అవుతోంది. పూత రావడానికి మోనో క్రోట్ 2 మి.లీ, బోరాన్ 2 గ్రాములు, 13.0.45ను 10 గ్రాములు ఒక లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఎండ కాస్తే వారం నుంచి పది రోజులకు పూత వచ్చే అవకాశం ఉంది

– జ్యోతి ప్రియాంక, ఉద్యాన శాఖాధికారి

మైలవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ

మైలవరం: మైలవరంలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌ను ఎన్టీఆర్ జిల్లా మద్య నిషేధ, అబ్కారీ అధికారి ఎస్. శ్రీనివాసరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ కార్యకలాపాలు, సిబ్బంది విధి నిర్వహణపై స్థానిక అధికారులతో సమీక్షించారు. గీత కార్మికులకు రిజర్వ్ చేసిన మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ ఎం. దుర్గాప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సారా విక్రయదారుడి అరెస్ట్

ముసునూరు: వేల్పుచర్లలో శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు దాడి చేశారు. నూజివీడు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వేల్పుచర్లకు చెందిన ఇస్లావత్ రాము ఇంటి వద్ద సోదాలు నిర్వహించి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుడిని నూజివీడు కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామన్నారు.

వరి గడ్డి వామి దగ్ధం



చాట్రాయి: ప్రమాదవశాత్తూ టపాసు పేలి వరిగడ్డి వామి దగ్ధమైన ఘటన సూరంపాలెం బీసీ కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. కోతులను బెదిరించేందుకు టపాసులు పేల్చారు. ఆ సమయంలో కాలనీకి చెందిన నాగుల కృష్ణ ఐదు ఎకరాల వరిగడ్డి వాముపై టపాసు పడడంతో పూర్తిగా కాలిపోయింది. సమాచారం తెలుసుకున్న నూజివీడు ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. గడ్డివాము దగ్ధం కావడం వల్ల సుమారు రూ.80 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.